

# అసంతృప్తి నేతలపై అభ్యర్థుల దృష్టి

- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంపై అభ్యర్థుల నజర్
- అసంతృప్తి నేతలపై ప్రత్యేక దృష్టి పెట్టిన పార్టీ అభ్యర్థులు
- సీనియర్ నేతలను రంగంలోకి దించి బుజ్జగింపులు
- నోటిఫికేషన్‌లోపు ఇబ్బందులు లేకుండా ప్రయత్నాలు

నిజామాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారజోరు పెంచిన అభ్యర్థులకు సొంత పార్టీ నేతల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి. స్వపక్షంలోనే కొంత మంది నేతలు కలిసి రావడం లేదు. పదవులు ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని అలకబూనుతున్నారు. ప్రచార కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటికే ప్రచారంలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు అసంతృప్తి నేతలను బుజ్జగించేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. సహకరించాలని కోరుతున్నారు. పార్టీకి చెందిన నేతలతో పాటు ఇతర సంఘాల వారితో చర్చలు జరుపుతున్నారు. సమావేశాలు నిర్వహిస్తూనే మద్దతు కూడగడుతున్నారు. తమ దగ్గరి అనుచరులను రంగంలోకి దింపి ప్రయత్నాలను చేస్తూనే ప్రచారాలను కొనసాగిస్తున్నారు. అసమ్మతిగా మారిన కొంత మంది నేతలు పార్టీలు మారుతుండగా మరికొంత మంది వచ్చే ఐదేళ్లను దృష్టిలో పెట్టుకొని ఇతర పార్టీలో చేరుతుండటంతో పోటీలో ఉండి ప్రచారం కొనసాగిస్తున్న అభ్యర్థులకు వారిని నిలబెట్టుకోవడం సమస్యగా మారుతోంది. పార్టీకి చెందిన సీనియర్ నేతల సహాయం తీసుకుంటూ వారి ముందుకు వెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ప్రాతినిధ్యం వహించేందుకు మూడు పార్టీల అభ్యర్థులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

## నామినేషన్‌కు పదమూడు రోజులు

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్‌కు ఇంకా పదమూడు రోజుల సమయం ఉండగానే అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ అరవింద్ పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ మద్దతును కూడగట్టుకుంటున్నారు. తమకు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీ క్యాడర్, నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు పోతున్నారు. బహిరంగ సభలు పెట్టకుండానే మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారాన్ని చేస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు గెలుపుపై ధీమాతో పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## సొంత పార్టీకి చెందిన నేతలతో ఇబ్బందులు

క్యాడర్‌తో పాటు ప్రజలు, సంఘాల మద్దతు వస్తున్నా.. సొంత పార్టీకి చెందిన కొంత మంది నేతల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లలో తమకు ఎవరు సహకరించలేదని కొంత మంది పార్టీ నేతలు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నేతలపై గుర్రుగా ఉంటూ నామమాత్రంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చాలా ఏళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన గుర్తింపు ఇవ్వలేదని వారు వాపోతున్నారు. మూడు పార్టీలకు చెందిన కొంత మంది నేతలు ఎన్నికల సమయంలో దూరంగా ఉంటుండటంతో ఆయా ప్రాంతాల్లో వారు కొంత మేర ప్రభావితం చేసే పరిస్థితుల్లో ఉండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు నష్టం జరుగుతుందని భావిస్తున్నారు. వారికి నచ్చచెప్పేప్రయత్నాలను చేస్తున్నారు. తమకు సహకరించాలని కోరుతున్నారు. తాము గెలిస్తే వారికి అవకాశాలు కల్పిస్తామని హామీలను ఇస్తున్నారు. పూర్తిస్థాయిలో వారు ప్రచారంలో పాల్గొనేందుకు గట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలతో పాటు తమకు దగ్గరగా ఉన్న నేతలను పంపిస్తూ వారిని బుజ్జగించే ప్రయత్నాలను చేస్తున్నారు. కొంత మంది నేతలు వచ్చే ఐదేళ్లను దృష్టిలో పెట్టుకొని పార్టీ మారుతున్నారు. ఇతర పార్టీలో చేరుతున్నారు. ప్రస్తుతం తమకు గుర్తింపు లేదని భావిస్తున్నవారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై నజర్ పెట్టి ఇతర పార్టీలో చేరుతున్నారు.

## వలస వెళ్లకుండా జాగ్రత్తలు

పార్లమెంట్ ఎన్నికల వరకు ఎక్కువ మంది వలసలు వెళ్లకుండా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రస్థాయి నేతల దృష్టికి తీసుకెళ్లి సహకరించే విధంగా చూస్తున్నారు. పూర్తిస్థాయిలో ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. ప్రచారంతో పాటు నేతలను సమన్వయపర్చడం అసంతృప్తి నేతలను బుజ్జగించడం పోటీలో ఉన్న అభ్యర్థులకు తలకుమించిన భారంగా మారుతోంది. నోటిఫికేషన్‌కు ఇంకా 13 రోజులే సమయం ఉండటంతో ఆలోపు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునేందుకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. మూడు పార్టీలకు చెందిన సీనియర్లు కూడా దృష్టి సారించడంతో కొంత మేర పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం నియోజకవర్గాల్లో పర్యటిస్తూ మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చే లోపు అన్ని మండలాలు పర్యటించి వివిధ వర్గాలతో చర్చలు జరుపుకునే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నామినేషన్ తర్వాత భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.





బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

- నివాళులర్పించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 5: దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ కమాన్ వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాత అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ రమేష్, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో..

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, నగర అధ్యక్షుడు కేశవేణు, ముప్ప గంగారెడ్డి, వైసాక్షి సంతోష్, అంతిరెడ్డి రాజరెడ్డి, గంగారెడ్డి, రేవతి, వినయ్, నగర మాజీ మేయర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## మాలమహానాడు ఆధ్వర్యంలో..

జిల్లా మాలమహానాడు ప్రతినిధులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, వినయ్‌కుమార్, నీలగిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నగరంలో నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

# కాంగ్రెస్ పార్టీకి హిందూ సమాజం అంటే గిట్టదు

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

పెద్దబజార్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీకి హిందూ సమాజం అంటే గిట్టదని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న జిల్లాలకు సంబంధించిన నిజాంషుగర్, సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించే సత్తా వారికి లేదన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసిందని అందులో స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని పొందుపర్చారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని అన్నారని ఆయన గుర్తు చేశారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నెలలోపు పంటల బీమా పథకం ద్వారా 10వేల రూపాయలు అందిస్తామని నమ్మబలికారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతుభరోసా కింద 15వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇంతవరకు అందించలేదన్నారు. రైతులకు రైతుభరోసా కింద నిధులు ఇవ్వరు కానీ కాంగ్రెస్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు బిల్లులు చెల్లిస్తారని ఆయన దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల రుణమాఫీ చేస్తామని బోనస్ 500 రూపాయలు ఇస్తామని అన్నారని అది ఎక్కడ అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత అహంకారానికి వెళ్లి జైలుపాలైందని, సోనియాగాంధీ సైతం అవినీతి పరురాలని అందుకే దేశంలో ఓటమిని చవిచూస్తుందన్నారు. అంతేకాకుండా అవినీతిని టెర్రరిస్టులను పెంచిపోషిస్తుందని అన్నారు. తాను లోకల్ ప్రాంతానికి చెందిన వాడినని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రోహింగ్యలకు ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఫ్యాక్టరీలను తెరిపించే సత్తా కాంగ్రెస్‌కు లేదని బీజేపీయే తెరిపిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మానాల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, బీజేపీ నాయకులు న్యాలం రాజు, సుదీర్, భూమన్న, ఆకుల శ్రీనివాస్, బంటురాము, తదితరులు పాల్గొన్నారు.






# డీసీఎంఎస్‌పై కాంగ్రెస్ నజర్

- చైర్మన్ మోహన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లవెల్లి పీఏసీఎస్‌లో డైరెక్టర్ల అవిశ్వాసం నోటీసు
- ఈనెల 19న సమావేశం నిర్వహించేందుకు అధికారుల నిర్ణయం
- పదవిని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్

నిజామాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీసీసీబీని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలు డీసీఎంఎస్‌పై నజర్ పెట్టారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టకుండానే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సొసైటీ పరిధిలో అవిశ్వాసానికి డైరెక్టర్లు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసుల ఆధారంగా సహకార శాఖ అధికారులు ఈనెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. డైరెక్టర్లకు సమాచారం పంపించారు. సొసైటీ చైర్మన్‌గా నల్లవెల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్‌ను అక్కడే అవిశ్వాసం పెట్టి తప్పిస్తే సంస్థ పార్టీ వశం కానుండటంతో నేతలు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు క్యాంపునకు వెళ్లగా డీసీఎంఎస్ చైర్మన్ మాత్రం కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పదవి నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నేతల నుంచి గ్రీన్ సిగ్నల్ మాత్రం ఇవ్వడం లేదు. రూరల్ నియోజకవర్గం నుంచి వ్యతిరేకత రావడంతో పార్టీ నేతలు కూడా కొత్త చైర్మన్‌ను నియమించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుపై పట్టు సాధించి కొత్త చైర్మన్‌ను నియమించుకున్న కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం డీసీఎంఎస్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మార్కెటింగ్ సొసైటీ కింద ఉన్న డీసీఎంఎస్ పలు కార్యక్రమాలు చేపడుతుండటంతో చైర్మన్ పదవిని కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రస్తుతం సాంబారి మోహన్ కొనసాగుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఆయన గత నాలుగేళ్లుగా చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

## పార్టీ మారుతున్న డైరెక్టర్లు, చైర్మన్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సంస్థలపైన వారు దృష్టి పెడుతుండటంతో ఎక్కువ మంది డైరెక్టర్లు, చైర్మన్లు పార్టీ మారుతున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌పైన అవిశ్వాసం పెట్టి నెగ్గినప్పటి నుంచి డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ కూడా పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్‌లోని ఎమ్మెల్యే, నేతలను కలిశారు. పార్టీలో చేరేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా స్థాయిలో ఉన్న పోస్టును కాపాడుకునేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్న ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు, అక్కడి కాంగ్రెస్ నేతలు మాత్రం వ్యతిరేకించారు. ఆయన చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టాలని జిల్లా సహకర శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసుల ఆధారంగా సహకార శాఖ అధికారులు పరిశీలించి ఈనెల 19న నిర్వహించేందుకు తేదీని నిర్ణయించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నల్లవెల్లి డైరెక్టర్లందరికి నోటీసులను ఇచ్చారు. అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చిన తొమ్మిది మంది డైరెక్టర్లు ఇప్పటికే క్యాంపునకు వెళ్లారు. అవిశ్వాసం పెట్టడంతో తమ పదవికి కాపాడుకునేందుకు వివిధ నేతల ద్వారా సాంబారి మోహన్ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది కాంగ్రెస్ నేతలు మొగ్గు చూపుతున్న ఆయన రావడం వల్ల ఎక్కువగా ఉపయోగం ఉండదని కిందిస్థాయి నేతలు అడ్డుకుంటుండటంతో చేర్చుకోవడం లేదు. ఇంకా పదిహేనురోజుల వరకు సమయం ఉండటంతో చైర్మన్ మోహన్ మాత్రం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా ఉన్న ఆయన పదవీ కోల్పోతే డీసీఎంఎస్ పదవి కూడా పోతుంది. రెండు పదవులు కీలకం కావడంతో గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అవిశ్వాసం లోపు మద్దతు దొరకకుంటే డీసీసీబీ చైర్మన్ లాగానే ఆయన కూడా రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ నేతలు మాత్రం అవిశ్వాసం పెట్టి కొత్త చైర్మన్‌ను ఎన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు.

# రంజాన్ వేళలు

| శనివారం | ఆదివారం |
|---|---|
| ఇఫ్తార్ | సహర్ |
| సా.6.36 | ఉ.4.43 |



దైవప్రసన్నతను ఆశిస్తూ సత్కార్యాన్ని చిత్తశుద్ధితో చేయాలి. లోకుల మెప్పుకోసం చేసే సత్కార్యాన్ని అల్లాహ్ ఇష్టపడడు.

# నిలిచిన పొద్దుతిరుగుడు కొనుగోళ్లు

- ఆందోళనలో రైతులు
- పంట కొనాలని వేడుకోలు

కోటగిరి, ఏప్రిల్ 5: పొద్దు తిరుగుడు పంట కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పండిస్తే పంటను అమ్ముకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తక్షణమే కొనుగోళ్లు చేపట్టకపోతే రాస్తారోకో చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో రైతులు శుక్రవారం పొద్దు తిరుగుడు పంట రాశుల వద్ద ఆందోళన చేపట్టారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పొద్దు తిరుగుడు పంటను విక్రయించేందుకు 213మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో 1500క్వింటాలుకు మాత్రమే మార్క్‌ఫెడ్ అధికారులు అనుమతి ఇచ్చారు. ఇప్పటికే 1400 క్వింటాళ్ల పంటను కొనుగోలు చేశారు. కేంద్రం వద్ద పొద్దు తిరుగుడు రాసులు పేరుకుపోయాయి. తమ పంటను కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. సుమారు 175మంది రైతులు పంటను విక్రయించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఒకే ఒక పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రం ఉండడంతో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గం నుంచి రైతులు పంటను విక్రయించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 10వేల క్వింటాళ్ల పొద్దు తిరుగుడు పంటను విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉన్న ప్రభుత్వం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో రైతులు గంగాప్రసాద్, శ్రీనివాస్, రాంబాబు, సంతోష్, నవీన్, విశ్వనాథ్, శంకర్ పటేల్, సతీష్, రాజు, అహ్మద్, హాస్సేన్ ఉన్నారు.



హెగ్డోలిలో ఆందోళన చేస్తున్న పొద్దు తిరుగుడు రైతులు


జిల్లా బాల సాహిత్య వేదిక సభ్యులు

## జిల్లా బాల సాహిత్య వేదిక ఏర్పాటు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 5: బాలల్లో సృజనశీలత పెంచడం, కవితలు, కథలు రాసేవిధంగా ప్రోత్సహించడం వంటి పలు సాహిత్య రూపాలకు నిలయంగా బాల సాహిత్య వేదిక ఏర్పాటు చారిత్రక అవసరమని పలువురు కవులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీతారంనగర్‌లో జిల్లా సాహిత్య వేదికను ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి, విమర్శకుడు, తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ఈ సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రముఖ కవులు, బాల సాహిత్యవేత్తలతో కలిసి ఈ వేదిక ఏర్పాటు చేశారు. జిల్లాలో బాలల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని, అందుకు వారికి సరైన తర్ఫీదునివ్వాలన్నారు. పిల్లల్లో పఠనాసక్తి పెంచడం, పద్యం, అవధానం లలో తర్ఫీదునివ్వనున్నట్లు నరేష్‌రావు తెలిపారు. ఈ సాహిత్య తొలి అధ్యక్షుడిగా డాక్టర్ కాసర్ల నరేష్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ్‌ముఖ్ ప్రవీణ్, దారం గంగాధర్, గంట్యాల ప్రసాద్, డాక్టర్‌శారదా హన్మాండ్లు, ప్రణవి, డాక్టర్.ఎ.శ్రీదేవి, నీలవేణి, జి.ఇందిర, కైరంకొండ బాబు, శ్రీమన్నాచార్య తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు.

## చికిత్సపొందుతూ యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘన్‌పూర్ చెరువుకట్ట దూస్‌గాం వెళ్లే రోడ్డుపై గురువారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైందని ఎస్సై మహేష్ తెలిపారు. కాగా బైకుపై ఉన్న డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నవీన్ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం నవీన్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.



# నమ్మబలికి.. మాట మార్చిన దళారీ!!

- ఎడపల్లిలో దళారీని నమ్మి మోసపోయిన రైతులు
- అధికారులు దళారుల వ్యాపారంపై నిఘా పెట్టాలని డిమాండ్

ఎడపల్లి, ఏప్రిల్ 5: రబీ(యాసంగి)లో వరి కోతలు ఊపందుకున్నాయి. అందులో భాగంగా రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొచ్చిన వేళ పచ్చి ధాన్యం రేటు ఆసక్తికరంగా ఉండడంతో వరి కోతలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా దాదాపు వంద ఎకరాల రైతులు తమ వరి పంటను కోతలు కోసి దాన్యాన్ని ఒక చోటికి చేర్చారు. అయితే ధాన్యం కుప్పలను చూసి కుప్పల దగ్గరికి వచ్చిన స్థానిక దళారి.. పచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తానని హామీ ఇచ్చి నమ్మించాడు. మూడు రోజులుగా దళారి వడ్లు నింపకపోవడంతో రైతులు ప్రతీరోజు దళారీని వడ్లు ఎప్పుడు నింపుతావు అని అడగగా.. ఇప్పుడే నింపుతామని సమాదానం ఇస్తూ అలా మూడు రోజుల పాటు దాట వేశాడు. మూడు రోజుల తర్వాత వచ్చి ధాన్యం రంగు మారిందని చేతులెత్తేశాడు. ఈ తతంగం ఎడపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎడపల్లికి చెందిన కొంతమంది రైతులు గ్రామ శివారులోని శివాలయం వద్ద వరి కోతలు కోసి ధాన్యాన్ని ఒక్కచోటుకి చేర్చారు. అప్పుడు అక్కడికి వచ్చిన స్థానిక దళారి పచ్చి ధాన్యానికి రేటు మాట్లాడుకుని వడ్లు కొంటానని హామీ ఇవ్వడంతో సరేనన్నారు. అలా దళారి చెప్పి నాలుగు రోజులు కావొస్తున్నా.. ధాన్యం కొనకపోవడంతో వరి కుప్పలు అలానే ఉండి పోయాయి. దీంతో రైతులు దళారీ దగ్గరకు వెళ్లి నాలుగు రోజులవుతుంది. వడ్లు కొంటానని చెప్పి కుప్పలు అలానే ఉన్నాయని నిలదీయగా.. వడ్ల కుప్పల దగ్గరకు వచ్చిన దళారీ వడ్లను చూసి వడ్లు రంగు మారాయి.. తాను కొనను అని సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీంతో రైతులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దళారీ వడ్లు కొనను అంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్మేవారమని, దళారీ పచ్చి వడ్లు కొంటామంటే ఎండబెట్టే ఖర్చు మిగులుతుందనే ఆశ పడి మోసపోయామన్నారు. ఇలా ప్రతీయేడు రైతులను దళారులు మోసం చేస్తున్నారని, దళారులు సిండికేట్‌గా మారి వారికి ఇష్టం వచ్చిన ధరలకు వడ్లు కొనుగోలు చేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగానే.. దళారులు కోత కోసి ఎండ బెట్టడానికి సిద్ధపడుతున్న రైతుల దగ్గరకు వచ్చి పచ్చి ధాన్యం కొంటామని హామీ ఇచ్చి నాలుగైదు రోజుల తర్వాత ధాన్యం రంగు మారిందని చెప్పి తక్కువ ధరకు కొంటున్నారని, యేటా ఇలానే మోసం చేస్తున్నారని రైతులు బోరుమంటున్నారు. రైతులను నమ్మించి మోసం చేసిన దళారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ● రంగుమారాయని చెప్పి.. : గుమ్ముల ప్రవీణ్, బాధిత రైతు



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఈనెల 2న కోతకు వచ్చిన వరి పంటను కోత కోసి వరి ధాన్యం కుప్ప పోయగా.. అక్కడకు వచ్చిన స్థానిక వడ్ల వ్యాపారి నర్సింలు పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తానన్నాడు. దీంతో వరి కప్పను అలానే ఉంచాను. శుక్రవారం దళారి వేరే వడ్లను పరిశీలిస్తుండగా వెళ్లి నిలదీయగా దళారి వచ్చి వరి ధాన్యం కుప్పను చూసి వడ్లు రంగు మారాయి, తాను కొనను అని చెప్పి వెళ్లి పోయాడు. దళారి మాటలను నమ్మి మోసపోయాను. దళారిపై చర్యలు తీసుకోవాలి.

### ● యేటా ఇలానే చేస్తున్నారు : ప్రవీణ్ కుమార్, రైతు, బర్దీపూర్



ప్రతీ సంవత్సరం రైతులను దళారులు మోసం చేస్తున్నారని దళారులు సిండికేట్‌గా మారి వారికి ఇష్టం వచ్చిన ధరకు వడ్లను కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగానే పచ్చి వడ్లకు అదిక ధర ఇస్తామని చెప్పి రైతులకు ఆశ చూపించి నమ్మించి నాలుగు రోజులపాటు వరి దాన్యం నింపక కుప్పలను అలాగే ఉండినిచ్చి అవి రంగు మారిన తరవాత కొనక పోవడంతో నష్టానికి దళారులకే విక్రయించేలా పన్నాగాలు పన్నుతున్నారని, దళారుల వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టి రైతులు మోసపోకుండా చూడాలి.


రంగు మారిన ధాన్యాన్ని చూపుతున్న బాధిత రైతు



లింగారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవన్‌రెడ్డి, సునీల్‌కుమార్

## కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

ఏర్గట్ల, ఏప్రిల్ 5: మండల కేంద్రంతో పాటు గుమ్మిర్యాల, దోంచంద గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గుమ్మిర్యాల్ మాజీ ఎంపిటీసి గడ్డం లింగారెడ్డి, దోంచంద మాజీ ఉపసర్పంచ్ ఇప్ప గంగయ్యతో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, ఇంద్రసేనా రెడ్డి, మునీర్, భాను పాల్గొన్నారు.

### ఆర్‌ఎంపీని బెదిరించి

## దోపిడీ చేసిన ఇద్దరు దొంగల అరెస్టు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్5: మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ పసుల గంగాధర్‌ను ట్రీట్‌మెంట్ నిమిత్తమై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఎక్కించుకొని గ్రామ పరిసరాల్లోని నిర్మాణ ప్రదేశాల్లోకి తీసుకువెళ్ళి కత్తి చూపించి డాక్టర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న వస్తువులను తీసుకొని దొంగాలించారని ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్ పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొలిప్యాక్ గ్రామంలో ఈనెల 3న మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ పశువుల గంగా ధర్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఎక్కించుకొని నిర్మాణ ప్రదేశంలోకి తీసుకువెళ్ళి కత్తిచూపించి డాక్టర్ వద్ద ఉన్న బంగారు ఉంగారాం, రూ.5వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఇద్దరు దొంగలు దోచుకు వెళ్ళిన కేసులో శుక్రవారం ఆర్మూర్ ఒడ్డెరకాలనీకి చెందిన చిన్న గంగాధర్, ద్యావల నర్సయ్య, తొర్లికొండకు చెందిన కాట్‌పల్లి సతీష్ అలియాస్ గంగారెడ్డి అనే ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వీరి వద్ద నుంచి దోపిడీ చేసిన బంగారం ఉంగారాం, ఒక సెల్‌ఫోన్, రూ.1500 నగదును వారు ఉపయోగించిన బైక్‌లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వారు తెలిపారు. పోలీస్ సిబ్బంది సర్దార్ భూపతి, సతీష్, డిచ్ పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్ తిరుపతిలు కలిసి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు.



బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ అర్వింద్



టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..



టీడీపీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆర్మూర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్



గడ్కోల్ గ్రామంలో..



మోర్తాడ్‌లో నివాళులు అర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

## ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రాం జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. బాబూజగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూజగ్జీవన్‌రాం అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళి అనుసరిస్తూ జయంతి వేడుకలు నిర్వహించారు.

● న్యూస్‌నెట్ వర్క్



తాడ్‌బిలోలి గ్రామంలో..



సీపీఐ ఆధ్వర్యంలో..



కమ్మర్‌పల్లిలో నివాళులర్పిస్తున్న మండల దళిత సంఘాల నాయకులు



నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ముప్కాల్‌లో నినాదాలు చేస్తూ..



కోటగిరిలో నిర్వహించిన జయంతి వేడుకలలో..



...పేటలో..



ఎడపల్లిలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో..

## పడకల్‌లో ఆర్మీ జవాన్ ఆత్మహత్య

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 5: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బోండ్ల భరత్ (30) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. పడకల్ గ్రా మానికి చెందిన భరత్ గతంలో ఆర్మీ జవాన్‌గా పని చేశాడని, గత మూడేళ్లుగా విధులకు హాజరుకాకపోవడంతో ఉద్యోగం కోల్పోయా రని, అప్పులు చేసి ఆర్థిక సమస్యలు ఎక్కువకావడంతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మనస్థాపం చెంది దులాని కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తిమ్మాపూర్‌లో ఈతవనాల దగ్ధం

మోర్తాడ్, ఏప్రిల్5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గీత కార్మికులకు పెంచుకుంటున్న ఈత చెట్లు దగ్ధమయ్యాయి. అయితే వీటిని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చెట్లకు నిప్పు పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. కార్మికులు శుక్రవారం ఉదయం ఈతవనానికి వెళ్లగా కొన్ని ఈత చెట్లు కాలిపోతూ కనిపించాయని తెలిపారు. గీత కార్మికులు ఉపాధి కోసం నాలుగేళ్ల క్రితం నుంచి 10 ఎకరాలలో ఈత చెట్లను పెంచుకుంటున్నారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని తెలిపారు. కావాలనే ఎవరో పథకంప్రకారం ఈతచెట్లను కాలివేశారని ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి పెంచుకుంటున్న ఈతవనం దగ్ధ కావడం పట్ల తాము ఉపాధి కోల్పోయామని గీత కార్మికులు వాపోయారు. ఈ విషయాన్ని మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయ అధికారులకు వివరించగా వారు స్పందించలేదని, కనీసం ఈతవనం సందర్శించలేదని బాధితులు చెప్తున్నారు. ఎవరైనా దుండుగల పేర్లు చెబితే వారిపై కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారులు అనడం విస్మయం కలిగించింది. అధికారులు స్పందించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు కోరారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

మాక్లూర్, ఏప్రిల్5: రైతులు తాము పండించిన పంటలను ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని మాక్లూర్ సొసైటీ చైర్మన్ బుర్రోల్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్‌పల్లి, వల్లభపూర్, గొట్టుముక్కుల, మాక్లూర్ గ్రామాలలో ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, దయాకర్‌రావు, కాశీనాథ్‌రావు, విండో పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన చంద్రయాన్‌పల్లి మాజీ సర్పంచ్

ఇందల్వాయి, ఏప్రిల్5: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ లలిత గంగాదాస్ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ఆయన శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే బూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఉపసర్పంచ్ ప్రకాశ్, మాజీ సర్పంచ్ మురళి, మరికొంత మంది బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆధరణ పెరుగుతుందని ఈ నేపథ్యంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి అనచివేతలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కుమ్మరి గంగాధర్, మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ గంగారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

## పొతంగల్‌లో అన్నను చంపిన తమ్ముడు

● కుటుంబ కలహాలతో దారుణం

కోటగిరి, ఏప్రిల్ 5: కుటుంబ కలహాలతో అన్నను తమ్ముడు దారుణంగా హత్య చేసిన ఘటన పొతంగల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పొతంగల్ గ్రామానికి చెందిన మంగళి గోవింద్ (54)ను అతడి తమ్ముడు విఠల్ గొడ్డలితో దాడిచేసి దారణంగా హత్యచేశాడు. గోవింద్ పొతంగల్‌లో మంగళి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తమ్ముడు విఠల్ కుటుంబం తరుచూ గొడవ పడుతూ ఉండేవారు. తమ్ముడితోపాటు తమ్ముడి భార్యను పలుమార్లు సముదాయించి నచ్చజెప్పేవాడు. భార్యభర్తల మధ్య గురువారం రాత్రి మరోమారు ఘర్షణ జరిగింది. పని ముగించుకుని గోవింద్ ఇంటికి వచ్చాడు. అప్పటికే కక్ష పెంచుకుని విఠల్ అన్న గోవింద్‌పై గొడ్డలితో దాడిచేశాడు. ఈ ఘటనలో గోవింద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలాన్ని రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలతోనే హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.



## నేడు షబ్-ఏ- ఖద్ర్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 5: సర్వమానవాళి, శ్రేయస్సు, శాంతి సహనం, సహచరజీవనం, విశ్వశాంతి కోసం దివ్వ అవతరించిన మహోన్నత రాత్రి, మహిమాన్విత వరాల వసంత రాత్రి షబ్-ఏ- ఖద్ర్. చాంద్రమానం ప్రకారం రంజాన్ తొమ్మిదో నెల, రంజాన్ మాసంలోని 27వ రోజును షబ్-ఏ-ఖద్ర్ (జాగ్‌నేకీ రాత్)గా ముస్లింలు ఆచరిస్తారు. ఈరోజు రాత్రి జాగరణ పాటించడం అనవాయితీ. షబ్-ఏ-ఖద్ర్ రోజునే పుణ్యప్రదమైన, మహనీయమైన దివ్వ గ్రంథమైన ఖురాన్ అవతరించినట్లు ముస్లింలు విశ్వసిసారు. అందుకే ఈ రోజు రాత్రిని శుభప్రదమైన రాత్రిగా కొలుస్తారు. ప్రవక్త మహమ్మద్ (సల్లెల్లాహు వలైవ సల్లెం) మక్కాలోని హీరాపర్వత గుహల్లో దైవారాధనలో నిమగ్నుడై ఉండగా హజ్‌రత్ జిబ్రయీల్(అలైసలాం) అవతరించి ఖురాన్‌లోని కొన్ని శ్లోకాలను ఆయనతో చదివిస్తాడు. దీనినే వహీ (దివ్వవాణి) అంటారు. హదీస్‌ల ప్రకారం ఈ రోజు రాత్రి జిబ్రాయీల్ అనేబడు గొప్ప దూత తన వేలాది మంది సిబ్బందితో అల్లాహ్ ఆజ్ఞలను తీసుకొని భూమిపై అవతరించిన రోజు రాత్రిగా కొలుస్తారు. షబ్-ఏ-ఖద్ర్ రోజు రాత్రి చేసిన ప్రత్యేక ప్రార్థనలు వేయి రాత్రుల పుణ్యాల ఫలితం దక్కుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం ఈరోజు రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే పాప పరిహారం లభిస్తుందని పెద్దలు చెబుతారు.

### నేటితో ముగియనున్న తరావి నమాజ్

రంజాన్ మాసం ప్రారంభం నుంచి ఆచరించే తరావి నమాజ్ షబ్-ఏ-ఖద్ర్ రాత్రి నుంచి ముగుస్తుంది. నెలరోజులపాటు ఇషానమాజ్ అనంతరం హఫీజే ఖురాన్ (దివ్య ఖురాన్ కంఠస్తంగా చదివి మౌల్వి) ఆధ్వర్యంలో ఖురాన్ 30 అధ్యాయాలు ప్రతీ నాలుగు రోజులు తరావి నమాజ్‌లో వినిపిస్తూ 27వ రాత్రి ( షబ్-ఏ- ఖద్ర్ రాత్రికి )పూర్తి చేస్తారు.

## శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ల అందజేత

పెద్దబజార్, ఏప్రిల్5: ద్వారకనగర్‌లో గల రామకృష్ణా ట్రస్టునేతృత్వంలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన వారికి శుక్రవారం మాధవ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అరవింద్ చేతుల మీదుగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ఉచితంగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లోకభూపతిరెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇందల్వాయి, ఏప్రిల్ 5: డిచ్‌పల్లి సబ్‌డివిజన్ పరిధిలోని 33కేవీ సబ్‌స్టేషన్ గన్నారం, మిషన్‌భగీరథ, సిర్నాపల్లి విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ గన్నారం, ఇందల్వాయి, మిషన్‌భగీరథ, తిర్మన్‌పల్లి, సిర్నాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 12న కబడ్డీ జిల్లా కార్యవర్గ సమావేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: ఈనెల 12వ తేదీన కబడ్డీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అంద్యాల లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని డీఎస్‌ఏ మైదానంలో ఈ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశంలో ఎన్నికల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

## గురుకుల పాఠశాలకు కూలర్ అందజేత

మోర్తాడ్, ఏప్రిల్ 5: మండల కేంద్రంలోని జ్యోతబాఫూలే పాఠశాలకు శుక్రవారం జ్యోతిబాఫూలే రజక సంఘం ఒరంటి పంథ సభ్యులు కూలర్‌ను బహుకరించారు. వేసవి ఎండను విద్యార్థులు ఇబ్బందులు పడడాన్ని గమనించి విద్యార్థుల కోసం కూలర్‌లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఒరంటి పంథ సభ్యులు ఒరగంట నర్సయ్య, రమేష్, సాయిరాం, నరేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీపీ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్5: రూరల్ మండల ఎంపీపీ బానోతు అనూష మామ తారాచంద్ నాయక్ మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం భౌతికకాయానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎంపీపీ కుటుంబసభ్యులను ఓదార్చారు.

### ● ఉదయం వాకింగ్‌తో చాలా ప్రయోజనాలు..

నిజామాబాద్ అర్బన్: కాలం ఏదైనా ఉదయం వాకింగ్ చేయడంతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఆయన వాకింగ్ చేస్తూ వాకర్స్‌తో ముచ్చటించారు. ఆయనతోపాటు మాజీ నుడా ఛైర్మన్ ప్రభాకర్, డిచ్‌పల్లి జెడ్పీటీసీ దాసరి లక్ష్మినర్సయ్య, దేవేందర్, వినోద్, తదితరులు ఉన్నారు.



వాకింగ్ చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



# ప్రజాస్వామ్యాన్ని కాపాడేవారికే ఓటు వేయాలి



ఆలయంలో పూజలు చేస్తున్న జీవన్‌రెడ్డి

నందిపేట, ఏప్రిల్5: దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేవారికే ప్రజలు ఓట్లు వేయాలని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపత్రి జీవన్‌రెడ్డి కోరారు. శుక్రవారం నందిపేట మండల కేంద్రంలోని మున్నూరుకాపు కళ్యాణ మండపంలో జరిగిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని, అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫలాలు అందుతాయని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, అందుకే లిక్కర్ స్కాంలో కవితను అరెస్టుచేసి జైలుకు పంపారని, అన్నారు. చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్‌ఎస్ ఫోన్‌ట్యాపింగ్ ద్వారా ప్రజలే కాకుండా నాయకులను, అధికారులను నిండా ముంచిందని, గత ప్రభుత్వ పాలకులు ఓట్లు ఆశించారని విమర్శించారు. పసుపుబోర్డు పేరిట ఓట్లు అడుగుతున్న ధర్మపురి అర్వింద్‌కు ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పార్టీ జిల్లాఅధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి మాట్లాడారు.

### కాంగ్రెస్‌లో చేరిన చిరాంజ్‌పల్లి సొసైటీ పాలకవర్గం

నందిపేట మండలంలోని చిరాంజ్‌పల్లి ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం పాలకవర్గం శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షం లో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్ చార్జీ వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సొసైటీ అధ్యక్షుడు బోంకన్ గంగారెడ్డి, వైస్ ఛైర్మన్‌పేరు నర్సయ్య, మాజీఛైర్మన్ మోహన్‌రావు, సొసైటీ డైరెక్టర్‌లు, కాంగ్రెస్‌లో చేరారు. అంతేగాకుండా మండల కేంద్రానికి చెందిన మాజీసర్పంచ్ మాజ రుద్దీన్, మాజీ వార్డుసభ్యులు మాజారుద్దీన్, ముస్లీం మైనారిటీ నాయకులు కాంగ్రెస్ చేరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేగం గంగారెడ్డి, పిప్పెర సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రుడు, మండల అధ్యక్షుడు మహిపాల్, తదితరులున్నారు.

### సిద్దులగుట్టపై జీవన్‌రెడ్డి పూజలు

ఆర్మూర్‌రూరల్: పట్టణంలోని పుణ్యక్షేత్రమైన సిద్దులగుట్టపై నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జీవన్‌రెడ్డి సిద్దులగుట్ట శివాలయంలో సిద్దేశ్వ రునికి అభిషేకం చేసిన రామాలయంలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి పెర్కిట్ చౌరస్తా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

### ఆలూర్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం

ఆలూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్, నాయకులున్నారు.

## 8 నుంచి 11 వరకు మార్కెట్‌కు సెలవు

ఖిల్లా, ఏప్రిల్5: ఈనెల 8 నుంచి 11 వరకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో క్రయవిక్రయాలకు సెలవుగా ప్రకటిస్తున్నట్లు కార్యదర్శి వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న అమావాస్య, 9న ఉగాది, 11న రంజాన్ ఉన్నందున 4 రోజుల పాటు కొనుగోళ్ల నిలిపివేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ మార్కెట్ ఈనెల 12న యధావిధిగా తెరచి ఉంటుందని తెలిపారు. రైతులు ఈ తేదీలను గుర్తుపెట్టుకొని మార్కెట్‌కు ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని కోరారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖిల్లా, ఏప్రిల్ 5: డిచ్‌పల్లి నిజామాబాద్ మధ్య మార్గంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. మృతుడికి సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుందని, అతడి చేతిపై శంకర్ అనే పేరుతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ కోసం రైల్వే ఎస్సై సాయరెడ్డి సెల్.87126 58591కు సంప్రదించాలని కోరారు.

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

నవీపేట, ఏప్రిల్5: మండలంలోని నాగేపూర్‌కు చెందిన కొంద్ర గంగామణి (55) గురువారం సాయంత్రం స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. గంగామణికి ప్రవీణ్, శ్రీనివాస్ కుమారులు ఉన్నారని, తమ కుటుంబానికి చెందిన 15 గుంటల భూమి విషయంలో అన్నదమ్ముళ్లు ఇటీవల తరుచూ గొడవలు పడుతుండడంతో మనస్థాపం చెందిన ఆమె స్థానిక నాగులకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని శుక్రవారం చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్‌ఎం

## సీతారాముల తలంబ్రాల పోస్టర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, ఏప్రిల్5: భద్రాద్రి సీతారాముల తలంబ్రాల పోస్టర్‌ను నిజామాబాద్ ఆర్‌ఎం జానిరెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జానిరెడ్డి మాట్లాడుతూ సీతారాముల కల్యాణ తలంబ్రాలను ప్రజలకు అందజేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంలు శంకర్, సరస్వతి, పీవో పద్మ పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్లు చీరల పంపిణీ

మోస్రా, ఏప్రిల్ 5: మండలంలోని చింతకుంట గ్రామశివారులో గల అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. తనవంతు సాయంగా ప్రతీ ఏడాది ఆశ్రమానికి రూ.51వేలు అందజేస్తానని ఏనుగు రవీందర్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతాప్‌సింగ్, తదితరులు ఉన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

● డీపీవో తరుణ్ కుమార్



ట్యాంకును పరిశీలిస్తున్న డీపీవో



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయని, గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా గ్రామస్థాయి అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సి.హెచ్ తరుణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామంలోని కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని మొక్కల నర్సరీ పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో కలియ తిరుగుతూ మంచి నీటి ట్యాంకులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశం అయి పలు సూచనలు చేశారు. నీటి సరఫరా చేసే మంచి నీటి ట్యాంకులను ప్రతీ పది రోజులకు ఒకసారి కచ్చితంగా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వసంత రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రానికి వచ్చిన గర్భిణీతో గొడవ పడుతున్న దృశ్యం

## బయటి వ్యక్తులతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

● లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం

మోస్రా, ఏప్రిల్ 5: మండల కేంద్రంలోని రామాలయం వెనుక గల అంగన్‌వాడీ కేంద్రాన్ని బయటి వ్యక్తులతో నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. కేంద్రానికి వచ్చే గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని లబ్ధిదారులకు ఆరోపిస్తున్నారు. రు. శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ మీటింగ్ ఉందని సెంటర్‌కు రాలేదు. ఆయా సైతం సెలవులో ఉంది. దీంతో ఓ ప్రైవేటు వ్యక్తితో కేంద్రాన్ని నడిపారు. సెంటర్‌కు వచ్చిన గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో కొత్త వ్యక్తి ఎవరని వారు ప్రశ్నించడంతో వారు బెదిరింపులకు పాల్పడినట్లు గర్భిణులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 19న సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం

ఇందల్వాయి, ఏప్రిల్5: నల్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఐడీసీఎంఎస్ ఛైర్మన్ సాంబారి మోహన్‌పై నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో ఈనెల 19న అవిశ్వాస బలపరీక్ష పెట్టనున్నట్లు డీసీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. తీర్మానానికి అనుకూలంగా సొసైటీ వైస్‌ఛైర్మన్ రమేష్‌తోపాటు మరో 8మంది డైరెక్టర్లు ప్రస్తుతం క్యాంపునకు వెళ్లారని, 19న అవిశ్వాస తీర్మాన సమావేశం ఉంటుందని తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ కార్యదర్శి

## నవీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట, ఏప్రిల్5: మండల కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ కార్యదర్శి మహేష్ ప్రారంభించారు. నవీపేట సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాలల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో సుప్రియ, సోసైటీ ఛైర్మన్ అబ్బన్న, డైరెక్టర్లు రాము, గణేష్, శ్రీనివాస్, గోపి, గౌతం, రైతులు పాల్గొన్నారు.

## యువతిపై మత్తు మందు చల్లి రూ.40వేల చోరీ



సీసీ పుటేజీలో రికార్డు అయిన ఫకీరు బాబా

నవీపేట, ఏప్రిల్ 5: భిక్షాటన కోసం వచ్చిన ఓ ఫకీరు ఆమెపై మత్తు మందు చల్లి ఇంట్లో ఉన్న రూ.40 వేలను ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం.. నాళేశ్వర్‌లోని ఎస్సీ కాలనీలో గురువారం నవనీత అనే యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆమె తల్లి పొలం పనికి వెళ్లగా సోదరుడు పని నిమిత్తం నిజామాబాద్ వెళ్లాడు. తండ్రి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భిక్షాటన పేరుతో ఓ ఫకీరు బాబా గ్రామంలో అనుమానాస్పదంగా సంచరించాడు. ఫకీరు బాబా యువతి ఇంటికి భిక్షాటన కోసం రాగా, ఆమె రూ.20 అతనికి ఇచ్చింది. ఇదే సమయంలో ఫకీరు బాబా తనకు దాహంగా ఉందని నీళ్లు ఇవ్వాలని కోరగా ఆమె ఇంట్లో నుంచి నీటిని తెచ్చి అతనికి అందించింది. ఇదే సమయంలో ఫకీరు బాబా యువతిపై మత్తు మందు చల్లడంతో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఇంట్లో ట్రాక్టర్ ట్రాలీ కొనుగోలు కోసం బస్తాలో రూ.40వేలను దాచగా ఫకీరు బాబా నగదు డబ్బుతో ఉడాయించాడు. కొద్దిసేపటికి తేరుకున్న యువతి ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వారు ఫకీరు బాబా కోసం గాలించినప్పటికీ అతడు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై అప్పటికే పారిపోయాడు. ఫకీరు బాబా వెంట మరోవ్యక్తి ఉన్నాడని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామంలో సీసీ కెమెరాలను పరిశీలించగా ఫకీరు బాబా గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు నమోదైంది. ఈ విషయంపై శుక్రవారం బాధిత కుటుంబం నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి రెండు బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

## బోధన్‌లో బాలుడి అదృశ్యం

బోధన్‌రూరల్, ఏప్రిల్5: పట్టణంలోని రాకాసిపేట్ గోసంబస్తీకి చెందిన ప్రవీణ్, రేణుకల కుమారుడు రాఘవ కనిపించడంలేదని ఫిర్యాదు వచ్చినట్లు సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. ప్రవీణ్, రేణుక కలిసి హనుమాన్ మందిరానికి వెళ్లారని, అక్కడి నుంచి బాలుడి తల్లి రేణుక కూలీ పనులు చేస్తుండగా తన కుమారుడు ఆడుకుంటానని చెప్పి చాలాసేపటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, సీసీ పుటేజ్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టామని త్వరలోనే బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగిస్తామని సీఐ పేర్కొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రుద్రూరు, ఏప్రిల్5: రుద్రూరు మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, తాహెర్ బీన్ అందాన్, మానాల మోహన్‌రెడ్డి, బ్లాక్ కంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రకారిణి అవంతికకు సన్మానం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 5: పట్టణంలోని తట్టికోటలోగల దండోరా సంఘం భవనంలో శుక్రవారం చిత్రకారుణి అవంతికను ఎమ్మార్పీఎస్ నాయకులు, కాలనీవాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగయ్య మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన అవంతిక రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ఉత్తమ చిత్రకారిణిగా ఆమె అవార్డు అందుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పుల చంద్రయ్య, హన్సేన్, పోశెట్టి, సుధాకర్, లింబూరి లక్ష్మణ్, సావిత్రి పాల్గొన్నారు.

## చికెన్ ధరలు

| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.155 | రూ.225 | రూ. 265 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.165 | రూ.235 | రూ. 275 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.70,900 | రూ.65,400 | రూ.820 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (10.30, 3.40, 7.05, 10.30)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (11.00, 1.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (4.20, 10.00)
మంజుమెల్ బాయ్స్ (7.00)
స్క్రీన్-3 : టిల్లు స్క్వేర్ (10.35, 7.45, 10.45,)
ఫ్యామిటీ స్టార్ (1.35)
: భరతనాట్యం (5.00)
స్క్రీన్-4 : మంజుమెల్ బాయ్స్ 10.35, 10.20)
టిల్లు స్క్వేర్ (1.35),
ప్రాజెక్ట్ - జెడ్ (4.35)
క్రూ (హిందీ) (7.30)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
స్క్రీన్-2 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 7.35, 10.30)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (4.50)
స్క్రీన్-3 : భరతనాట్యం (1.40)
: టిల్లు స్క్వేర్ (7.35)
మంజుమెల్ బాయ్స్ (7.30, 10.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్: ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : ప్రాజెక్ట్-జెడ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మంజుమల్ బాయ్స్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్